

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	గురువారం	శుక్రవారం
కర్నూలు	6: 31	5:11
నంద్యాల	6: 28	5:11

నేరం..బేరం..!

నంద్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)

ఖాఖీల డొంక కదులుతోంది. అవినీతి అక్రమాల ఆరోపణల్లో ఇద్దరు డీఎస్పీలు, సీఐలే కాకుండా మరి కొందరు ఉన్నట్టు తెలుస్తోంది. పోలీసు అధికారుల దందాపై ఆంధ్రజ్యోతిలో 'గాడి తప్పుతున్న.. ఖాకీలు' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ అంశం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతోపాటు పోలీసు శాఖలోనూ పెనుదుమారం రేపింది. ఈ క్రమంలోనే మరి కొంత మంది సీఐలు, ఎస్ఐలు కూడా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలిసింది. వీరంతా నెలవారి మామూళ్లతో తమ జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొందరైతే మరీ దారుణం. డబ్బులు తీసుకొని తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేయకుండా వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పోలీసు స్టేషన్లు పంచాయితీలకు అడ్డాగా మారాయన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.



- కదులుతున్న ఖాకీల డొంక
- పోలీసులు శాఖలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న అవినీతి అక్రమాలు
- కానిస్టేబుళ్లు, హోంగార్డులను అడ్డు పెట్టుకొని సీఐ, ఎస్ఐల దోపిడీ
- ఉత్సవాల బందోబస్తు పేరుతోనూ వసూళ్లు
- పంచాయితీలకు అడ్డాగా పోలీస్ స్టేషన్లు

అవినీతి అక్రమాల్లో ఆ ఇద్దరు డీఎస్పీలు.. ఐదుగురు సీఐలే కాదు.. మారి కొంత మంది కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అక్రమ వసూళ్లతో మరికొందరు సీఐలు, ఎస్ఐలు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. డోన్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ సీఐ కింద పని చేస్తున్న ముగ్గురు ఎస్ఐలు తమదైన శైలిలో మట్కా, పేకాట, నాటుసారా, బెల్ట్ షాపుల నుంచి పెద్దఎత్తున మామూళ్లు తీసుకుంటున్నారని సమాచారం. ఆయా ఎస్ఐలు కానిస్టేబుళ్లతో పాటు హోంగార్డులను అడ్డుగా పెట్టుకొని ఆయా వర్గాల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. అయితే సదరు సీఐకి తెలిసి జరుగుతోందా.. లేక ఎస్ఐ స్థాయిలోనే అక్రమ వసూళ్లకు తెరలేపారా.. అనే అనుమానాలు లేకపోలేదు. ఇదే సబ్ డివిజన్ పరిధిలోని మరో సీఐ, ఓ ఎస్ఐకి ఓ పేరుమోసిన పీడీఎస్ వ్యాపారి నుంచి నెలవారి మామూళ్ల రూపంలో రూ.2 లక్షలు, ఎస్ఐకి రూ.లక్ష, ఆపై ఉన్నతాధికారికి రూ.లక్ష చొప్పున ముడుతున్నట్లు ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. సదరు వ్యాపారిపై ఇప్పటికే 40 కేసులు నమోదయ్యాయని సమాచారం. వీటితోపాటు మట్కా, పేకాటరాయుళ్ల నుంచి సదరు సీఐ, ఎస్ఐలకు నెలవారి మామూళ్లు వస్తున్నట్లు వినికిడి.




- ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని ఓ రూరల్ సర్కిల్ సీఐ స్టేషన్‌కు వచ్చే ప్రతి కేసును పంచాయితీ చేసి క్యాష్ చేసుకుంటున్నారని తెలిసింది. రేషన్ బియ్యం తరలింపు వ్యాపారులతో కూడా నెలవారిగా రూ.లక్ష తీసుకుంటున్నారని సమాచారం. వీటితో పాటు సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో జరిగే జాతరలు, పోలీసుల బందోబస్తు పేరుతో సదరు సీఐ నాయకులు, ఆయా గ్రామాల పెద్దల నుంచి వసూలు చేసినట్లు తెలిసింది. ఇటీవల రెండు గ్రామాల వారి నుంచి సుమారు రూ.2 లక్షలు వసూలు చేశారని సమాచారం. అదేవిధంగా అదే సర్కిల్ పరిధిలోని ఓ ఎస్ఐ సైతం ఇసుక ట్రాక్టర్ పట్టుబడిన ఒక్కొక్క ట్రాక్టర్ నుంచి రూ. 10 వేలు వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం.

- ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోనే మరో సీఐ ఓ మండల ఎస్ఐ ఇద్దరు కలిసి గత 15 రోజుల వ్యవధిలో పేకాటస్థావరాలపై దాడులు చేశారు. అయితే కేసు నమోదు చేయకుండా.. పట్టుబడిన రూ.2.50 లక్షలతోపాటు అదనంగా రూ. 2.50 లక్షలు పేకాటరాయుళ్ల నుంచి తీసుకున్నారని తెలిసింది. అదే మండల ఎస్ఐ పరిధిలోని మరో ప్రాంతంలో దాడులు చేయగా రూ.4 లక్షలు పట్టుబడితే రూ.12 వేలు చూపించి బొక్కేశారని ఆ శాఖ వర్గాల నుంచి సమాచారం. ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న ఆపై అధికారి సైతం వారిపై తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించి క్యాష్ చేసుకున్నారని తెలిసింది. డీఎస్పీని ఆసరాగా తీసుకుని సదరు సీఐ, ఎస్ఐ కూడా జేబులు నింపుకుంటుండటం పలు విమర్శలకు తావిస్తోంది.

- ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని ఓ దేవస్థానం పరిధిలోని ఓ ఎస్ఐ పోస్టు పది నెలల నుంచి ఖాళీగా ఉంది. దీంతో సదరు స్టేషన్‌కు చెందిన సీఐనే అంత తానై వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా గుట్కా, సిగరెట్లు, బీడీలు యథేచ్ఛగా విక్రయించేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా వ్యాపారుల దందాకు అడ్డులేకుండా సదరు సీఐకి నెలవారి మామూళ్లు ముట్టచెబుతున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో సదరు స్టేషన్‌కు ఎస్ఐని రాకుండా తెరవెనుక కథ నడిపించి అక్రమ వసూళ్లకు అడ్డు లేకుండా చేసుకున్నారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది.

● మోనార్క్ డీఎస్పీపై మరిన్ని ఆరోపణలు...



ఇటీవల జరిగిన శ్రీశైలం బ్రహ్మోత్సవాల సమయంలో కూడా సదరు డీఎస్పీ అందిన కాడికి దోచుకోవడమే లక్ష్యంగా పని చేశారని తెలుస్తోంది. ప్రధానంగా సదరు డీఎస్పీ మంజూరు చేసిన సుమారు 400 వెహికల్ పాసుల విషయంలోనే సదరు డీఎస్పీ తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించారని సమాచారం. ఈ క్రమంలో అక్కడి సత్రాలు, దుకాణాలకు చెందిన వ్యాపారులతోపాటు తహసీల్దార్ సైతం పాసుల విషయంలో సదరు డీఎస్పీతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. సదరు డీఎస్పీ ఆఫీసుకు.. 12 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఓ మండలంలోని.. రెండు మద్యం దుకాణాల నుంచి మొదట రూ. 80 వేల చొప్పున నెలకు రూ.1.60 లక్షల సదరు డీఎస్పీ తీసుకునే వారని సమాచారం. అయితే ప్రస్తుతం సదరు దుకాణాల నుంచి నెలకు రూ.1.20 లక్షలు మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిసింది. ఒకవేళ ఇవ్వకపోతే సంబంధిత ఎస్ఐని రంగప్రవేశం చేయించి పలు రకాలుగా బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. పీడీఎస్ బియ్యం వ్యాపారుల నుంచి నెలవారి మామూళ్లు తీసుకుంటున్నారని తెలిసింది. ఒక్కొక్కరితో నెలకు రూ.లక్ష చొప్పున సదరు డీఎస్పీ క్యాష్ చేసుకుంటున్నట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఇటీవల తాజాగా.. తమ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు చెందిన బియ్యం వ్యాపారుల నుంచి రూ. 2 లక్షలు తీసుకున్న ట్లు సమాచారం. ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా తమ సిబ్బందిపై సదరు డీఎస్పీ బెదిరింపులకు దిగుతున్నారని తెలిసింది.

- నంద్యాల సబ్ డివిజన్‌కు పడమర దిశగా ఉన్న పోలీసు స్టేషన్‌లో పని చే స్తున్న ఓ సీఐ, ఎస్ఐపై పలు ఆరోపణలు ఊపందుకున్నాయి. సదరు మండల పరిధిలోని కంకర, మట్టి, క్వారీల నుంచి ఇతర ప్రాంతాలకు తరలించే టిప్పర్ల డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క టిప్పర్ నుంచి రూ.5 వేల చొప్పున.. మొత్తంగా 50 టిప్పర్లకు కలిపి నెలకు.. రూ.2.50 లక్షలు వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వ్యవహారం అంతా కూడా సదరు సీఐ వద్ద పని చేస్తున్న ఓ కానిస్టేబుల్‌తో పాటు ఓ హోంగార్డు కనుసన్నుల్లో జరుగుతోందని సమాచారం. ఇక నాటుసారి విక్రేతల నుంచి సుమారు నెలకు.. రూ.1.50 లక్షలు, రెండు మద్యం దుకాణాల నుంచి నెలకు రూ. 2 లక్షల చొప్పున వసూలు చేస్తున్నారని సమాచారం.

మిగతా 6వ పేజీలో...

ఆ ఖాకీలపై డీఐజీ ఆరా

- డీఎస్పీలు, సీఐలపై విచారణకు ఆదేశం

నంద్యాల, మార్చి5(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లాలోని కీలక పోలీస్ అధికారుల తీరుపై కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆరా తీశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'గాడి తప్పుతున్న ఖాకీలు' కథనం పోలీస్ శాఖలో అలజడి సృష్టించింది. ఈ నేపథ్యంలో డీఐజీ కోయ ప్రవీణ్ స్పందించి వెంటనే నంద్యాల ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో పాటు ఏఎస్పీ యుగంధర్‌తో మాట్లాడారు. ఆయా డీఎస్పీలు, సీఐలపై లోతుగా విచారణ చేసి సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. దీంతో ఆయా అధికారులు ఆయా అంశాలపై ఆరా తీసే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలో సమగ్ర నివేదిక డీఐజీ వద్దకు చేరనుంది. దీంతో ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన ఆయా అధికారుల్లో నెలకొంది.

31 వరకే ఆయకట్టుకు నీరు

- తాగు నీటికి 4 టీఎంసీలు నిల్వ
- టీజీపీ ఎస్ఈ ఎన్. శివప్రసాద రెడ్డి



నంద్యాల మున్సిపాలిటీ మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు మార్చి 31 వరకే నీరు విడుదల చేయనున్నట్లు ఎస్ఈ శివ ప్రసాదరెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 1,24,459 ఎకరాలు ఉండగా వివిధ కారణాల వల్ల 84 వేల ఎకరాలకు 2200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు బుధవారం తెలిపారు. ఈ నీరు 73 కిమీ దగ్గర ఉన్న 30వ బ్లాక్ పరిధిలోని అహోబిలం పొలాలకు వరకు వెళుతుందన్నారు. 2024 డిసెంబరు 20 నుంచి 2025 మార్చి 31 వరకు వారబందీ పద్ధతి ప్రకారం నీరు విడుదల చేస్తున్నామని ప్రస్తుతం మార్చి 4 నుంచి 15 వరకు నీరు విడుదల చేసి, ఆ తర్వాత వారం సరఫరా ఆపి చివరగా మార్చి 26 నుంచి 31 వరకు ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామన్నారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకొని పంటలను రక్షించుకోవాలని సూచించారు. రానున్న ఎండాకాలం దృష్ట్యా తాగు నీటి నిలువలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.



నేత్రపర్వంగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవం

- ఎగువన ధ్వజారోహణం
- సింహ వాహనంపై జ్వాలా నరసింహ స్వామి
- దిగువన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం



పల్లకిలో కొలువైన జ్వాలా నరసింహ స్వామికి గ్రామోత్సవం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 5(ఆంధ్రజ్యోతి) :అహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో బుధవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గరుత్మంతుని చిత్రపటాన్ని ఆవిష్కరించారు. జ్వాలా నరసింహస్వామికి అభిషేకం, భేరీ పూజ నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవీ సమేతే జ్వాలా నరసింహస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకిలో గ్రామోత్సవం చేశారు. జ్వాలా నరసింహస్వామి సింహ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలం లో జ్వాలా నరసింహస్వామి గురువారం హంస, సూర్యప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

● దిగువలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ : దిగువ అహోబిలంలో నారసింహుడి బ్రహ్మోత్సవాలకు అర్చకులు బుధవారం అంకురార్పణ చేశారు. విష్వక్సేనుడికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున ధ్వజారోహణం నిర్వహిస్తారు.



దిగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

కేసీ ఆయకట్టు పంటలను కాపాడుతాం

- జల వనరుల మంత్రి నిమ్మల ఫరూక్ భేటీ



మంత్రి నిమ్మల, ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్‌తో ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ ఆయకట్టు కింద సాగు అవుతున్న పంటలను కాపాడుతామని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని కేసీ అధికారులు రబీ ఆయకట్టుకు నీటి విడుదల ఆపివేశారు. రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో మంత్రి ఫరూక్ జలవరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రి నిమ్మలతో పాటు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ కర్నూలు జిల్లా జలవరుల శాఖ అధికారులతో మాట్లాడి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కేసీ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పంటలు కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

జలవనరుల శాఖలో పదోన్నతులు

7లో..

ఇంటి స్థలాలకు బడ్జెట్ కేటాయించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

వివరాలు 7లో

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

7లో..

వేటుకు రంగం సిద్ధం..!

- రుద్రవరం పంచాయతీ అక్రమార్కులపై చర్యలు తీసుకోనున్న అధికారులు
- గతంలో రూ.1.88 కోట్లు స్వాహా
- తాజా నివేదికలోనూ అదే స్థాయిలో అవినీతి బట్టబయలు
- ఫిర్యాదు చేసిన వారికి బెదిరింపులు

నంద్యాల, మార్చి5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మేజర్ పంచాయతీలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రూ.1.88 కోట్లు దుర్వినియోగమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆ గ్రామ ప్రజలు ఈ అవినీతిపై ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ రాజకుమారి విచారణకు అదేశాలు జారీ చేశారు. దీంతో డీఎల్పీఓ రాంబాబు విచారణతో అసలు విషయం బయటపడింది. గత నాలుగేళ్ల వ్యవధిలో పలువురు కార్యదర్శులు, సర్పంచ్, పలువురు వైసీపీ నాయకులు కుమ్మక్కై రూ. 188 కోట్లు కాజేశారని తేలింది. ఈ వ్యవహారంపై ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఆంధ్రజ్యోతిలో 'ఏకమై కాజేశారు..!' అనే కథనం ప్రచురించడంతో జిల్లా వ్యాప్తంగా ఈ విషయం చర్చనీయాంశమైంది. ఒక్కసారిగా ఈ అక్రమంలో భాగస్వాములైన వారిలో అలజడి రేగింది. అయితే మరోసారి కలెక్టర్ సమగ్ర విచారణకు మరోసారి ఆదేశించడంతో అక్రమార్కులకు తాత్కాలికంగా ఉపశమనం కలిగింది. తాజా సమగ్ర నివేదిక కలెక్టర్ వద్దకు చేరడంతో నేడో రేపో వారిపై కలెక్టర్ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.





సచివాలయ కార్యాలయం

● తాజా నివేదికలోనే రూ.1.88 కోట్లు స్వాహా ..

ఈ ఏడాది జనవరి నెలలో డీఎల్‌పీఓ రాంబాబు అందించిన నివేదికలో రూ. 1.88 కోట్ల నిధులు స్వాహా చేసినట్లు తేలింది. మరోసారి సమగ్రంగా ఇవ్వాలనే కలెక్టర్ ఆదేశం తర్వాత గత నెల 28వ తేదిన డీఎల్‌పీఓ జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) షేక్ జమీవుల్లాకు తాజా నివేదిక అందజేశారు. ఇది కలెక్టర్ వద్దకు చేరింది. అయితే ఈ రెండు నివేదికల్లోనూ ఏ కార్యదర్శి.. ఏఏ సమయాల్లో ఎంతెంత నిధులు డ్రా చేసిందీ స్పష్టంగా లేదు. అయినప్పటికీ కలెక్టర్ ఎప్పుడు ఎవరి మీద చర్యలు తీసుకొనేదీ తెలియక అక్రమాలకు పాల్పడ్డవాళ్లు అలజడికి లోనవుతున్నారు.

● నెల రోజుల గడువులో రూ. 20 లక్షలు డ్రా...


మొదట విచారణ నివేదిక అందజేయగానే.. కలెక్టర్ తక్షణమే సదరు పంచాయతీ సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయకుండా కనీసం హోల్డ్‌లో పెట్టకుండా మరోసారి సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ వ్యవధిలో సర్పంచ్, కార్యదర్శితో కలిసి వివిధ పనుల నిమిత్తం జనరల్ ఫండ్ కింద రూ. 20 లక్షలు డ్రా చేసినట్లు సమాచారం. అయితే ఎలాంటి చర్యలు ఉండేదీ ఆ శాఖలో ఉత్కంఠగా మారింది. పైగా గడుపు సమయంలో రూ. 20 లక్షలు వరకు నిధులు డ్రా చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

● ఫిర్యాదుదారులకు బెదిరింపులు

సదరు పంచాయతీ అక్రమాలపై ఫిర్యాదు చేసిన వారిని సర్పంచ్‌తో పాటు అక్రమాల్లో భాగస్వాములైన వైసీపీ నాయకులు రకాలుగా బెదిరిస్తున్నట్లు తెలిసింది. రూ. 188 కోట్లు అక్రమాలు జరిగినట్లు నివేదిక అందజేసినప్పటికీ మరోసారి సమగ్ర నివేదిక అందజేయాలని అదేశించడం అక్రమార్కులకు కాస్త ఉపశమనం కలిగినట్లైంది.

● నేడో..రేపో చర్యలకు రంగం సిద్ధం

తాజా నివేదికతో అక్రమార్కులపై కలెక్టర్ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు ఆ శాఖ నుంచి తెలిసింది. రూ. కోట్లలో ప్రజాధనం దుర్వినియోగం చేసిన సర్పంచ్‌తో పాటు అక్రమాల్లో భాగస్వాములైన కార్యదర్శులు, వైసీపీ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయం ఆసక్తిగా మారింది. వీరిపై శాఖాపరమైన చర్యలతో పాటు రీకవరీ దిశగా చర్యలకు ఆదేశించినట్లు తెలిసింది. నేడో రేపో అక్రమార్కులపై వేటు పడనున్నట్లు తెలుస్తోంది.



మార్చి ఒకటో తేదీన కలెక్టర్‌కు డీపీవో అధికారులు ఇచ్చిన నివేదికలు

కల్యాణ వైభోగమే...

- ఘనంగా గోదా రంగనాథ స్వామి కల్యాణోత్సవం
- హాజరైన త్రిదండి అష్టాక్షరీ పీఠాధిపతి



కల్యాణ వేడుకలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి వారు..


కర్నూలు కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారు మామిదాలపాడులో వెలసిన గోదారంగనాథ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం శ్రీదేవీ భూదేవీ సమేత రంగనాథ స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. త్రిదండి అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఆలయ వేద పండితులు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్, లక్ష్మీనారాయణాచార్యులు, మహేషాచార్యుల నేతృత్వంలో కల్యాణ వేడుకలను వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఉదయం 10:30 గంటలకు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరింపజేసి, ఆలయ మండపంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారిని హనుమద్వాహనంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్వామి,అమ్మవారు గరుడ వాహనంపై విహరించారు. మహిళల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి గ్రామోత్సవం సాగింది. ఈ వేడుకలో ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, పెరుమాళ్ల బాలసుధాకర్, ఇటిక్యాల పుల్లయ్య, వేముల జనార్ధన్, లింగం క్రిష్టయ్య శెట్టి, వేముల రవిప్రకాశ్, తల్లం సురేశ్‌బాబు, వేముల శివనాగప్రసాద్ పాల్గొన్నారు.



శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి వార్ల కల్యాణ వేడుకలను తిలకిస్తున్న భక్తులు

నేరం.. బేరం..!

(5వ పేజీ తరువాయి)



వీటితో పాటు బెల్ట్‌షాపుల రూపంలో ఒక్కొక్క షాపు నుంచి రూ.25 వేల చొప్పున సుమారు రూ.2 లక్షల వరకు జేబులు నింపుకుంటున్నారని సమాచారం. ఇంత పెద్దమొత్తంలో సంపాదన రావడంతో పోలీసు స్టేషన్ సేవలపై సదరు అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదని తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో కేసులు నమోదు చేయకుండా పంచాయితీలు చేసి ఇరువర్గాల నుంచి తవదైన శైలిలో సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. ఇదే క్రమంలో తమకు ఎలాంటి సమస్య తలెత్తకుండా అధికార పార్టీకి చెందిన నాయకులను అడ్డుగా పెట్టుకున్నారనే ప్రచారం ఉంది. గత నెలలో తమ పరిధిలోని ఓ గ్రామంలో పట్టపగలే.. 5తులాలు బంగారు, రూ.50 వేలు నగదు చోరీకి గురైతే సదరు పోలీసులు ఇంత వరకు కేసు కూడా నమోదు చేయలేదని తెలిసింది. ఇదే తరహాలో మరో గ్రామంలో 8తులాల బంగారు, రూ.10 వేలు నగదు చోరీకి గురైతే ఇక్కడ కూడా కేసు నమోదు చేయలేదని తెలిసింది. మరీ దారుణం ఏమిటంటే.. సదరు స్టేషన్‌కు పక్కనే ఉన్న ఓ బ్యాంకు ఉద్యోగి బుల్లెట్ వాహనం సైతం ఏడాది కింద చోరీకి గురైనా పోలీసుల కేసు నమోదు చేయడం లేదని బాధిత ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. అక్రమ సంపాదన మోజులో పడి.. అసలు పోలీసు పని పక్కన పెట్టారనే విమర్శలు లేకపోలేదు. ఆయితే.. సదరు పరిధిలోని ఓ సోలార్ ప్లాంట్‌లో మాత్రం ఏ నిమిషం ఏం జరిగినా సదరు సీఐ, ఎస్‌ఐలు వెంటనే వాలిపోతారనే విమర్శలు అక్కడ లేకపోలేదు.

- నంద్యాల సబ్ డివిజన్‌కు 14 కిలోమీటర్ల దూరంలో ఓ మండల పోలీసుస్టేషన్‌లో 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మూడు మద్యం దుకాణాలు మాత్రమే ఉన్నాయి. దీంతో ఆయా వ్యాపారులు మిగిలిన గ్రామాల్లో గుట్టుగా (బెల్ట్‌షాపు) మద్యం అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. తమ అక్రమ వ్యాపారాలకు అడ్డులేకుండా నెలవారి మామూళ్లతో పోలీసులకు సరిపెడుతున్నారని సమాచారం. ఈ వ్యవహారంలో ఇద్దరు కానిస్టేబుళ్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిసింది.

- నంద్యాల సబ్ డివిజన్‌కు కూత వేటు దూరంలో ఉన్న.. ఓ మండల పోలీసు స్టేషన్ పని చేస్తున్న ఓ ఎస్‌ఐ గత దసరా పండుగ నేపథ్యంలో ఆయుధ పూజ పేరుతో.. సదరు మండల పరిధిలోని 20 గ్రామాలకు చెందిన నాయకులు, వ్యాపారుల నుంచి సుమారు రూ. 3 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. తమ పరిధిలోని ఓ గ్రామంలో ఓ వ్యక్తి తన భార్యను చంపితే.. సదరు కేసును కూడా ఆత్మహత్యగా చిత్రీకరించి సుమారు రూ. 50 వేలు బొక్కేశాడని తెలిసింది. సదరు ఎస్‌ఐ రోడ్డు ప్రమాదాల కేసుల్లోను తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించారని సమాచారం. ఇక పేకాటరాయుళ్ల నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఓ హోంగార్డును పెట్టుకుని మరీ నెలవారీ మామూళ్లకు పాల్పడుతున్నారని ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది.

- ఆళ్లగడ్డ పరిధిలోని మరో సీఐ సైతం స్టేషన్‌కు వచ్చే బాధితులతో పంచాయితీలు చేయడం.. తమదైన శైలిలో ఇరువర్గాల నుంచి క్యాష్ చేసుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇందుకు.. ఓ పంచాయతీ కార్యదర్శి తమ పరిధిలో జరిగిన ఓ అక్రమ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదు చేసిన సదరు సీఐ కేసు కట్టనీయకుండా వ్యవహరించారని తెలిసింది. దీంతో చేసేదీ లేక సదరు పంచాయతీ కార్యదర్శి నేరుగా డీఎస్పీ, ఎస్పీకి కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదు. ఎఫ్ఐఆర్‌కు నమోదు డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఇలా సదరు సీఐ తమదైన శైలిలో ఓ ప్రైవేట్ వ్యక్తిని మధ్యవర్తిగా పెట్టుకొని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. కానిస్టేబుళ్లు, హోంగార్డులు సైతం బరితెగించి అక్రమ వసూళ్లకు బరితెగిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

జలవనరుల శాఖలో పదోన్నతులు

- జిల్లాలో ఇద్దరు ఎస్‌ఈలకు సీఈగా ప్రమోషన్
- కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈగా కబీర్ బాషాకు రెగ్యులర్ పోస్టింగ్
- తిరుపతి టీజీపీ సీఈగా పదోన్నతిపై వరప్రసాద్ బదిలీ



షేక్ కబీర్ బాషా




ఏవీఎల్ఎన్ వరప్రసాద్

కర్నూలు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో పలువురు ఎస్‌ఈలకు చీఫ్ ఇంజనీర్లు (సీఈ)గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో ఇద్దరు ఎస్ఈలు పదోన్నతి పొందారు. కర్నూలు జలవనరుల శాఖ ప్రాజెక్టు సీఈ అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) చూస్తున్న నంద్యాల ఎస్ఆర్‌బీసీ-1 సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) షేక్ కబీర్ బాషాను సీఈగా పదోన్నతి ఇస్తూ ఇక్కడే రెగ్యులర్ పోస్టింగ్ కల్పించారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఈయన బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. 1992లో ఏఈఈగా ఉద్యోగంలో చేరి నాగార్జునసాగర్ డ్యాంలో విధుల్లో చేరారు. 2006లో డీఈఈగా పదోన్నతిపై వినుకొండ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో చేరారు. 2019లో ఈఈగా... 2020 మేలో ఎస్ఈగా పదోన్నతి ఇచ్చారు. ఎస్ఆర్‌బీసీ సర్కిల్-1 ఎస్ఈగా పని చేస్తూ.. 2020 నుంచి కర్నూలు ప్రాజెక్ట్ సీఈగా ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. సీఈగా పదోన్నతి ఇవ్వడమే కాకుండా అదే పోస్టులో రెగ్యులర్ చేశారు.

- **తిరుపతి టీజీపీ సీఈగా వరప్రసాద్**

హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్ఈగా పని చేస్తున్న ఎవీఎల్ఎన్ వరప్రసాద్‌కు ప్రభుత్వం సీఈగా పదోన్నతి కల్పించింది. తిరుపతి తెలుగుగంగ ప్రాజెక్టు సీఈగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన వరప్రసాద్ ఏఈఈ నుంచి ఎస్ఈ వరకు వివిధ హోదాల్లో ఆయా ప్రాజెక్టుల్లో పని చేశారు. సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన తర్వాత ఏఈఈ ఉద్యోగంలో చేరారు. నంద్యాల టీజీపీలో తొలి సారిగా ఉద్యోగంలో చేరిన ఆయన 2002లో పదోన్నతిపై నందికొట్కూరు ఏబీఆర్ డివిజన్ డీఈఈగా బాధ్యతలు చేపట్టారు. 2016లో పదోన్నతిపై ఎస్ఆర్‌బీసీ పాణ్యం ఈఈగా, ఇన్‌చార్జిగా ఎస్ఈగా బాధ్యతలు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో ఎస్ఈగా పదోన్నతిపై హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్ఈగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రెండు నెలలు గడవకనే సీఈగా పదోన్నతిపై తిరుపతికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి



మహిళా సాధికారతను చాటేలా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.

కర్నూలు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కలెక్టర్‌ను ఆదేశించారు. మార్చి 8 నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, మహిళా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో

కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్‌కుమార్

కల్లూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా బి.ప్రవీణ్‌కుమార్ నియామకమయ్యారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆదేశాల మేరకు కర్నూలు డీఐజీ పీజీఎస్ కళ్యాణి బి.ప్రవీణ్‌కుమార్‌ను కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు అందుకున్న ఆయన బుధవారం కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కల్లూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన శ్రీనివాసరావు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లారు.

నేడు రాఘవేంద్రుడి

430వ జన్మదిన వేడుకలు


- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- నేటితో ముగియనున్న గురు వైభవోత్సవాలు

మంత్రాలయం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):మంత్రాలయం రాఘవేంద్రస్వామి 430వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. గురువారం రాఘవేంద్రస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవరాయడి బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి సుందరంగా అలంకరించనున్నారు. టీటీడీ నుంచి వచ్చిన పట్టువస్త్రాలను స్వామివారిని అలంకరణ చేయనున్నారు. మఠం ప్రాంగణంలో చెన్నై నుంచి 20వ నాదాహర సమర్పణ సేవ చేయనున్నారు. దాదాపు 200 మంది సంగీత విద్వాంసులు ఏకధాటిగా నాదాహర సమర్పణలో పాల్గొననున్నారు. రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు ముగియనున్న గురువారం రాత్రి యోగీంద్ర కళామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



టీటీడీ పట్టువస్త్రాలు తీసుకువస్తున్న టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం

రాఘవరాయడికి విశేష పంచాభిషేకం



- తుంగా తీర వాసునికి భక్తుల నీరాజనాలు
- బృందావనానికి విశేష పుష్పాలంకరణ
- టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ
- ప్రహ్లాదరాయలకు పాద పూజ

రథాలపై దర్శనమిచ్చిన ఉత్సవమూర్తి



రాఘవేంద్రస్వామి బృందావనం




మాట్లాడుతున్న పీఠాధిపతి

రాఘవరాయని మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం చేశారు. గురు వైభవోత్సవాల్లో 5వ రోజు బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం పట్టువస్త్రాలను తీసుకురాగా, మధ్వమార్గ్ కారిడార్ నుంచి మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి శ్రీపతాచార్ తదితరులు ఊరేగింపుగా శ్రీమఠానికి తీసుకువచ్చారు. పీఠాధిపతి మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ఆనందతీర్థాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, వాదిరాజాచార్, రాజాఎస్ అప్రమేయాచార్ తదితరులు పాల్గొన్నారు. ఐదో రోజు యోగీంద్ర కళామండపంలో మక్తల్ కళాకారుల భరతనాట్యం భక్తులను అలరించింది.

ప్రముఖులకు అవార్డుల ప్రదానం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాల్లో 5వ రోజు బుధవారం రాత్రి యోగీంద్ర కళామంటపంలో ప్రముఖులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అవార్డులను ప్రదానం చేశారు. కర్నాటక దేవదాయ శాఖ కమిషనర్ ఎంవీ వెంకటేష్, ఢిల్లీ అవినీతి నిరోధక, ఆపరేషన్ కమిటీ జనరల్ సెక్రటరీ కృష్ణ మోహన్‌సింగ్, బెంగుళూరుకు చెందిన న్యూస్ 1 చానల్ ఎండీ రవికుమార్‌లకు ప్రశంస పత్రం, మెమెంటో, వెండి ప్లేటు, శేషవస్త్రం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి, మాజీ మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, మేనేజర్లు వెంకటేష్‌జోషి, సురేష్ కోణాపూర్ తదితరులు పాల్గొన్నారు.



మంచాలమ్మను అలంకరించిన దృశ్యం



ఢిల్లీ అవినీతి నిరోధక మరియు ఆపరేషన్ కమిటీ జనరల్ సెక్రటరీ కృష్ణ మోహన్‌సింగ్‌కు అవార్డును అందజేస్తున్న పీఠాధిపతి



నృత్యం చేస్తున్న కళాకారులు

మన మిత్ర ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మొదటిసారి విద్యార్థులు వాట్సాప్ మనమిత్ర యాప్ ద్వారా ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకోవచ్చుని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ బుధవారం తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడు చేసుకునే విధానం వివరించినట్లు తెలిపారు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు జీవ నియంత్రణ మందులు

కృషి

- పౌడర్, లిక్విడ్ రూపంలో తక్కువ ధరకే..




నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు తీపి కబురు అందజేశారు. భూమిలో రోగనిరోధకశక్తిని పెంచుతూ పంటకు హాని కల్గించే చీడ పీడ పురుగుల నివారణకు అత్యంత శక్తివంతమైన జీవ నియంత్రణ మందులను అందుబాటులోకి తీసుకరానున్నారు. అందుకు ప్రభుత్వం నుంచి తగిన నిధులు కూడా మంజూరయ్యాయి. మరో ఆరునెలల్లోనే రైతులకు మందులను అందుబాటులోకి తెస్తున్నట్లు ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- **పౌడర్, లిక్విడ్ రూపంలో...**

రాష్ట్రీయ కృషి యోజనా పథకం ద్వారా బయో కంట్రోల్ ఏజన్సీ నుంచి రైజోబీయమ్, ట్రైకోడెర్మా, సూడోమోనాస్ మందులను పౌడర్, లిక్విడ్ రూపంలో రానున్నాయి. పౌడర్ మూడు నెలల నుంచి ఆరునెలలు, లిక్విడ్ మూడు నెలలు మాత్రమే నిల్వవుండేలా నంద్యాలలోని ఆర్ఏఆర్ఎస్‌లోనే తయారు చేసి, తక్కువ ధరకే అందించనున్నారు.

- **విత్తన శుద్ధి విధానం:** ఎకరాకు విత్తనశుద్ధి కోసం పౌడర్ రూపంలో అయితే 10 గ్రాముల పౌడర్ కాని, లిక్విడ్ రూపంలో అయితే లీటర్ నీటికి 5 ఎంఎల్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవచ్చు. పంటలకు డ్రిప్ ద్వారా కూడా అందించవచ్చు. పంటలకు ఎకరాకు వాడాలంటే 90కేజీల పశువుల ఎరువు, 10కేజీల వేపచెక్క, 2 కేజీల ట్రైకోడెర్మా పౌడర్ కలిపి 15 రోజుల పాటు మట్టితో కప్పిపెట్టి పంటలకు చల్లవచ్చు. ఇవి భూమిలో గడ్డకట్టిన పోషకాలను కరిగించి మొక్కకు అందజేస్తాయి. మొక్కలకు హానికల్గించే సూక్ష్మ జీవులను నాశనం చేస్తాయి. ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంటలను అందిస్తాయి.

- **ఆరు నెలల్లో రైతులకు అందుబాటులోకి తెస్తాం**



జీవనియంత్రణ మందుల తయారీకి ఇప్పటికే నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌కు ప్రభుత్వం నుంచి రెండు కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే ప్రయోగశాల, తయారీ కేంద్రం, మిషనరీని ఏర్పాటుచేసి ఆరునెలలలోపే రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. రైతులకు పరిశోధనా కేంద్రంలోనే కేజీ పౌడర్‌ను వంద రూపాయలకు, లీటర్ లిక్విడ్‌ను రూ.150కు విక్రయిస్తాం.

– డాక్టర్ ఎం. జాన్సన్, ఏడీఆర్, ఆర్ఏఆర్ఎస్, నంద్యాల



క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



క్రికెట్ ఆడుతున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బంగారుపేట ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ లీగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడు తూ క్రీడలతో శారీరక ధృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కూడా కల్గునన్నారు. బంగారుపేటకు చెందిన నీలి షికారులు నిర్వహిస్తున్న బీపీసీఎల్ పోటీ లకు స్థానికులే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల నుంచి క్రీడాకారులు కర్నూలు వచ్చి క్రీడల్లో పాల్గొనడం అభినందించదగ్గ విషయమన్నారు. టీజీ భరత్ ప్రీమియర్ లీగ్ పేరుతో కర్నూలు నగరంలో ఇలాగే తాము కూడా పోటీలు నిర్వహించి యువతకు ప్రోత్సాహకాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్ర మంలో మాజీ కార్పొరేటర్ విఠ లశెట్టి, బంగారుపేట ప్రీమియర్ లీగ్ ఆర్గనైజర్లు సురేష్, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో అభివృద్ధి పనులకు నిధులు

కల్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖలో పలు అభివృద్ధి పనులకు రూ.1.07 కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఆ శాఖ ఎస్ఈ.ఎం. ఉమాపతి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖలో స్టోర్స్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు, సెక్షన్ ఆఫీసుల అధునికీకరణకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో సనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ సివిల్ సెక్షన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సివిల్ సెక్షన్ ఏడీఈ కె.జగదీశ్వరరాయుడు ఇండోర్ స్టోర్స్‌లో ఒక షెడ్ ఏర్పాటుకు రూ.30 లక్షలు, అదేవిధంగా స్టోర్స్ వెనకభాగంలో వర్షపునీరు వెళ్లేలా డ్రైనేజీ నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరయ్యాయన్నారు. మామిదాలపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కంపౌండ్, ఫెన్సింగ్ నిర్మాణానికి రూ.9.5 లక్షలు, నంద్యాల జిల్లా గడివేముల నూతన సెక్షన్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 30 లక్షలు, రుద్రవరం సెక్షన్ ఆఫీసు భవన నిర్మాణానికి రూ.21.5 లక్షలు విడుదల అయినట్లు తెలిపారు. ఆదేవిధంగా వార్త ఆఫీసు పరిధిలోని సబ్‌స్టేషన్‌లో కాంపౌండ్ నిర్మాణానికి రూ.14 లక్షలు శాంక్షన్ అయిందని ఏడీఈ తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. ఈ మేరకు స్థానిక న్యాయ సేవా సదన్ భవన్‌లో వారు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ జాతీయ లోక్ అదాలత్‌ను ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న అన్నీ కోర్టులలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారమయ్యే కేసులపై ఎటువంటి అప్పీలు ఉండవని, కోర్టు ఫీజు కూడా ఉండదని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

'నెలాఖరు వరకు ఆ రైళ్ల సర్వీసులు రద్దు'

మద్దికెర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లిన ప్యాసింజర్ రైళ్ల తిరిగి గుంతకల్లు డివిజన్ చేరుకునేందుకు ఈ నెలాఖరు వరకు పడుతుందని, అప్పటి వరకు పలు రైళ్ల సర్వీసులను రద్దు చేసినట్లు డివిజన్ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తిరుపతి-కదిరిదేవరపల్లి (57405) ప్యాసింజర్ రద్దును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు తెలిపారు. అదే విదంగా కదిరిదేవరపల్లి- తిరుపతి (57406) ప్యాసింజర్ ఈ నెల 31 వరకు, గుంతకల్లు-తిరుపతి (57404) ప్యాసింజర్ 30 వరకు, తిరుపతి-గుంతకల్లు (57403) ప్యాసింజర్ ఈ నెల 31 వరకు తిరగవని చెప్పారు. తిరుపతి-హుబ్లీ (57401) ప్యాసింజర్‌ను ఈ నెల 15 వరకు, హుబ్లి-తిరుపతి ప్యాసింజర్ రద్దును ఈ నెల 16 వరకు పొడిగించినట్లు వెల్లడించారు.

ఇంటి స్థలాలకు బడ్జెట్ కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో గృహ నిర్మాణ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బుధవారం సీఆర్ భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేదప్రజల సొంత ఇంటికలను నెరవేరుస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అర్హులైన పేదల ప్రజలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్ల స్థలం ఇచ్చి నాలుగు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడం కోసం నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పి. రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆవుల శేఖర్, లెనిన్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ఎనిమిది మందికి గాయాలు

రుద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో బుధవారం రాత్రి ఇరువర్గాలు కత్తులతో దాడులు చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. పాత కక్షల నేపథ్యంలోనే దాడులు చేసుకున్నారన్నారు. ఒక వర్గానికి చెందిన విజయుడు, కిషోర్, చిట్టిబాబు, వినోద్ కుమార్, మరో వర్గానికి చెందిన శేఖర్, కిరణ్, రవి, వెంకటేశ్వర్లు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆటోల్లో, 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, వివరాలు సేకరించామని ఎస్ఐ తెలిపారు. బెస్త కాలనీలో అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలి పారు.

చాగలమర్రిలో వ్యక్తి ఆత్మహత్య

చాగలమర్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల సమీపంలో కడప జిల్లా కానగూడుకు చెందిన అమీర్‌బాషా (45) బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అమీర్‌బాషా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుం బీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ బిల్లులు పెండింగ్

చేపట్టిన పనులు	పెండింగ్ నిధులు
భవనాలు	రూ. 44,56,620
ప్లాంటేషన్	రూ. 14,26,501
సీసీ రోడ్లు	రూ.14,61,83,455
మినీ గోకులాలు	రూ. 42,78,291
ఇతర పనులకు	రూ. 22,31,198

- పల్లెల అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపం
- రూ.36 కోట్ల బిల్లులు ఇవ్వని ప్రభుత్వం
- పేరుకే పల్లె పండుగ హడావిడి



పంచలింగాల గ్రామంలో పల్లె పండుగలో భాగంగా రోడ్డు నిర్మాణం

కర్నూలు న్యూసిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ వారోత్సవాల పేరుతో ప్రభుత్వం చేసిన హడావిడి అంతా ఇంత కాదు. గత ఏడాది అక్టోబర్‌లో గ్రామాభివృద్ధి లక్ష్యంతో పనులు ప్రారంభించింది. ఈ పనుల బిల్లులు మాత్రం ఇప్పటికీ విడుదల చేయలేదు. పల్లెల్లో సీసీ రోడ్ల పనులు సంక్రాంతికి పండుగ నాటికి పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులు సమీక్షలు నిర్వహించారు. బిల్లుల విడుదల గురించి పట్టించుకున్నపాపాన పోలేదు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని కూటమి ప్రభు త్వం విమర్శిస్తూ ఉంటుంది. కానీ అదే దారిలో తానూ ఉన్నట్లు గుర్తించడం లేదు.

పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో రోడ్లు తదితర అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టింది. చేసిన పనులకు చేసినట్లుగా ఎం.బుక్‌లో రికార్డు చేసి బిల్లులను అప్‌లోడ్ చేశాక రెండు, మూడు రోజుల్లోనే బిల్లులు వస్తాయని చెప్పింది. ప్రతి వారం అప్పటికి చేసిన పనులకు బిల్లులు వస్తాయ ని ప్రకటించింది. ఇది ఒట్టి మాటేనని ఆచరణలో తేలిపోయింది. ప్రభుత్వ తీరు మీద కాంట్రాక్టర్లు తీవ్ర విమర్శలు ప్రకటిస్తున్నారు. ప్రతి వారం చేసిన పనులకు బిల్లులు పడతాయని మొదట్లో చెప్పారు. ఒకటి రెండు వారాలు తప్ప, ఆ తర్వాత బిల్లులు విడుదల చేయలేదు.

బకాయిలు రూ.36 కోట్లు

గ్రామాల సీసీ రోడ్ల పనులకు ఇప్పటి వరకు రూ.36 కోట్లు వరకు బకాయిలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. గత నెల 20 వరకు వివిధ పనులకు రూ.30.85 కోట్లు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నా.. ఈ పదిరోజుల్లో ఈ పెండింగ్ రూ.36 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది.



నాణ్యతకు తిలోదకాలు..

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలలో జరిగిన పనుల క్వాలిటీపై కూడా అధికారులు దృష్టి సారించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేగంగా సీసీ రోడ్లు వేయడం, క్యూరింగ్ చేయకపోవడం వంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. రోడ్ల నాణ్యత పట్ల పీఆర్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజనీర్లు పనుల పట్ల పూర్తి స్థాయిలో దృష్టి సారించనట్లు తెలుస్తోంది. కర్నూలు, ఆదోని డివిజన్లకు ఇద్దరు డీఈఈలు, నలుగురు ఏఈలు ఉన్న కారణంగా అన్ని పనులపై వీరు దృష్టిని కేంద్రీకరించలేకపోతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే పూర్తి అయిన పనులకు వంద శాతం బిల్లుల చెల్లింపు జరగదని, మొత్తం బిల్లులో 15 శాతాన్ని డిపాజిట్‌గా ఉంచుకుని, క్వాలిటీ చెక్ చేసిన తరువాత డిపాజిట్‌గా ఉంచుకున్న మొత్తాన్ని విడుదల చేస్తామని ఇంజనీర్లు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పెండింగ్ బిల్లుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సీసీ రోడ్లు, ఇతర పనుల బిల్లులు త్వరలోనే విడుదల అవుతాయి. ఇప్పటి వరకు చేసిన పనులకు రూ.36 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేశాం. మిగిలిన రూ.5 కోట్ల పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ పని వెంటనే పూర్తి చేయాలని క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశాం. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో క్వాలిటీకి రాజీ పడటడం లేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు. **- వి. రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ**

870 పనులకు రూ.70.18 కోట్లు

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.70.18 కోట్లతో 870 పనులు చేపట్టారు. ఈ పనుల్లో ఇప్పటి వరకు 742 పనులు పూర్తి చేసినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఈ పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని నిర్ణీత గడువును కూడ విధించిన నేపథ్యంలో పల్లెల్లో కూటమి పార్టీలకు చెందిన నేతలు హడావిడిగా పనులు చేస్తున్నారు.

యూబీఐ కార్యాలయంలో మహిళా దినోత్సవం



ఉద్యోగులకు వైద్యపరీక్షలు

కర్నూలు కల్చరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీ య మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కర్నూలు, నంద్యాలలో వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేసి, ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఓమ్ని హాస్పిటల్, స్మైల్ డెంటల్ కేర్, సుశీలా నేత్రాలయం ఆధ్వర్యంలో ఆయా విభాగాలకు చెందిన వైద్య నిపు ణులు బీపీ, షుగర్, థైరాయిడ్, దంత, నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాల యం రీజనల్ హెడ్ పి.నరసింహారావు, డిప్యూటీ రీజనల్ హెడ్స్ ఇ. సురేంద్ర గౌడ్, ఎన్‌వీ అనంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ తమ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బ్యాంకు ఖాతాదా రులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ తనిఖీ

కర్నూలు హాస్పటల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌పై అంతస్థులో నిర్మిస్తున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ పనులను సూపరింటెండెంట్ డా.వి.వెంకటేశ్వర్లు బుధ వారం తనిఖీ చేశారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌లో భాగంగా నిర్మిస్తున్న యూనిట్ పనులను వేగవంతం చేయాలని ఏపీఎంఎస్ఐ డీసీ డీఈ కరీముల్లాను ఆదేశించారు. నిర్మాణ పనులు ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని అడిగారు. క్రిటికల్ కేర్ యూనిట్ ద్వారా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో వచ్చే వారికి తక్షణం ఆరోగ్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డా.కే.సీతారామయ్య, డా.శ్రీరాములు, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, ఎమర్జెన్సీ విభాగపు హెచ్‌వోడీ డా.రాంశివనాయక్, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వాహనాల వేలం వాయిదా

కర్నూలు అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో వివిధ నేరాల కింద పట్టుబడిన వాహనాల వేలం ప్రక్రియ వాయిదా పడింది. బుధవారం ఉదయం కర్నూలు ఎక్సైజ్ పోలిస్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 19 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, ఒక కారును వేలం వేసేందుకు ముందస్తుగా ప్రకటించారు. కానీ వేలం ప్రక్రియకు కేవలం 10 మంది మాత్రమే రావడంతో వాయిదా వేసినట్లు సీఐ చంద్రహాస్ తెలిపారు. తదుపరి వేలం ప్రక్రియను ఈనెల 12న నిర్వహిస్తామని తెలిపారు.

వ్యవసాయ యాంత్రీకరణకు పచ్చజెండా

- రైతులకు తీపి కబురు
- జిల్లాకు 1,660 యూనిట్లు, నంద్యాల జిల్లాకు 1,635 యూనిట్లు
- రూ.5.60 కోట్ల సబ్సిడీ కేటాయింపు



స్ప్రేయర్ ద్వారా మందుల పిచికారీ



కర్నూలు అగ్రికల్చర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు రైతుల మొర ఆలంకించింది. రైతులకు తీపి కబురు పంపింది. వ్యక్తిగతంగా పంటలకు అవసరమయ్యే సాగు యంత్ర పరికరాలను అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. గత ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాలు అందించకుండా సంఘాల పేరుతో యంత్రాలను అందజేసే కార్యక్రమానికి తెర లేపారు. అయితే.. ఆ పార్టీ నేతలు, వారి అనుచరులకే యంత్ర పరికరాలను కట్టబెట్టారు. ప్రస్తుతం అవి ఎక్కడా కనిపించడం లేదు. యంత్ర పరికరాలకు రుణాలు అందజేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులకు సంఘాల నుంచి రుణ బకాయిలు అందజేయడంలో చుక్కలు కనిపిస్తున్నాయి. రైతుల విజ్ఞప్తిని కూటమి ప్రభుత్వం పరిశీలించి వ్యక్తిగతంగా యంత్ర పరికరాలను అందించేందుకు శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహకారంతో మరో వారంలోనే రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాల పంపిణీకి సంబంధించి చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జేడీలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏ యంత్ర పరికరానికి ఎంత ధర ఉంటుందో ఆ పరికరానికి ప్రభుత్వం అందించే సబ్సిడీ ఎంతో నిబంధనలు విడుదలయ్యాయి. యంత్ర పరికరాల పంపిణీ ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కర్నూలు జిల్లాకు 1,660 యూనిట్లు, నంద్యాల జిల్లాకు 1635 యూనిట్లు మంజూరయ్యాయి. వీటి కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం రూ.5.60 కోట్లు రాయితీని మంజూరు చేసింది. రైతులకు అందిస్తున్న రాయితీలో 60 శాతం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకునేలా ఏర్పాటు చేస్తున్నామనీ జేడీ వరలక్ష్మి తెలిపారు.

పత్తా లేని కస్టం హైరింగ్ కేంద్రాలు

గత ప్రభుత్వం కస్టం హైరింగ్ కేంద్రాల ద్వారా రైతుసంఘాలకు పరికరాలను అరకొరగా పంపిణీ చేసింది. వీటిని వైసీపీ నాయకులు, వారి అనుచరులే కైవసం చేసుకోవడంతో అర్హులైన రైతులకు యంత్ర పరికరాల వినియోగం దూరమైంది. రైతులు ముందుగా ఈ పరికరాల మొత్తం సొమ్ము చెల్లిస్తే.. ఆ తర్వాత తీరిగ్గా డీబీటీ విధానంలో రైతు బృందాలకు రాయితీ సొమ్ము చెల్లించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అటువంటి నిబంధనలకు స్వస్తి చెప్పి రైతువాటా సొమ్మును చెల్లిస్తే ప్రభుత్వం ఆయా కంపెనీలకు వెంటనే రాయితీ జమ చేసి యంత్ర పరికరాలు రైతులకు అందేలా చర్యలు తీసుకుంటుంది. దీనివల్ల కాలయాపన ఉండదని వ్యవసాయ అధికార వర్గాలు తెలిపాయి. ఐదెకరాల్లోపు భూములు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులు మహిళలు, సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ యంత్రీకరణ పరికరాల పంపిణీకి నిధులు మంజూరు అయ్యాయని, ఒక కుటుంబంలో ఒక రైతుకు మాత్రమే అందిస్తారని స్పష్టం చేస్తున్నారు. పరికరాలు పొందాలనుకునే రైతులు ఈ నెల 12 నుంచి రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని జేడీ వరలక్ష్మి తెలిపారు. వ్యవసాయ సహాయకుడి లాగిన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, మండల వ్యవసాయాధికారి ఆమోదం పొందాక వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు లబ్ధిదారులకు పరికరాలు అందజేస్తామ న్నారు. అవసరమైన రైతులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని జేడీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆత్మకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని పాత చెక్‌పోస్టు సమీపంలో గల కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సతీష్ (23) అనే యువకుడు మృతి చెందాడు. పట్టణంలోని గొల్లపేటకు చెందిన హరి కుమారుడైన సతీష్ ఓ ప్రైవేట్ సంస్థలో కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం 4గంటల సమయంలో కేజీ రోడ్డుపై బైక్‌పై వెళ్తు ఎదురుగా ఆర్టీసీ బస్సును ఓవర్ టెక్ చేసే ప్రయత్నం చేయగా వెనక నుంచి ఓ వాహనం ఢీకొట్టింది. పెద్దగా గాయాలు కానప్పటికీ యువకుడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అక్కడున్న వారు వెంటనే యువకుడిని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. ఎస్ఐ నారాయణరెడ్డి స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ రాము తెలిపారు.

జీజీహెచ్ పై అంతస్థు ఎక్కి గర్భిణి నిరసన

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

కర్నూలు హాస్పిటల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్ మాతా శిశు సంరక్షణ కేంద్రం (గైనిక్ విభాగం) పై అంతస్థు ఎక్కి ఓ గర్భిణి నిరసన తెలపడం కలకలం రేపింది. కల్లూరు మండలం బస్తిపాడుకు చెందిన రేవతి రెండో కాన్పు కోసం పురిటి నొప్పులతో సోమవారం రాత్రి గైనిక్ వార్డుకు వచ్చింది. వైద్యులు పరీక్షలు నిర్వహించి బిడ్డ అడ్డం తిరిగిందని, లోపలే శిశువు మృతి చెందినట్లు నిర్ధారించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు గర్భిణి విపరీతమైన నొప్పిని భరించలేకపోయింది. గంటలు గడుస్తున్నా వైద్యులు పట్టించుకోకపోవడం, గర్భిణి తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక మనస్థాపానికి గురైంది. దీంతో పై అంతస్థు ఎక్కి నిరసన తెలిపింది. దీంతో గైనిక్ విభాగం ఎదుట గందరగోళం నెలకొంది. కొందరు యువకులు పరుగున పై అంతస్థుకు వెళ్లి గర్భిణిని కిందకు తీసుకురావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన జరిగిన గంట తర్వాత గర్భిణికి నార్మల్ డెలివరీ నిర్వహించారు. ఒత్తిడిని తట్టుకోలేక గర్భిణిపై అంతస్తు ఎక్కినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఈ ఘటన తమ దృష్టికి రాలేదన్నారు.

ఆంధ్రజ్యోతి
చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

అన్ని కులాల సంబంధాలు
బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, సచివాలయం, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్ : **87908 44959.** (2వ సంబంధాలు కలవు.)
AJL-229073

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ **7382114647**
AJA-226849

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

వేడుక ఏదైనా... సందర్భం ఎటువంటిదైనా
వివాహ వార్షికోత్సవం
స్వదేశీ, విదేశీయానం
లీగల్ ప్రకటనలు
పదవీ విరమణ
శ్రద్ధాంజలి
జన్మదినం
షష్టిపూర్తి
జయంతి
వర్ధంతి
క్లాసిఫైడ్స్
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతి లో ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలియచేయండి.
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9985402121

వంతెన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెండింతలైన అంచనా వ్యయం
- కాంట్రాక్టర్లు మారినా పనులు పూర్తికాని వైనం
- ఇరుకు వంతెనపై వెళ్లడానికి వాహనదారుల అవస్థలు


అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం


ఇరుకు వంతెనపై ప్రయాణికుల కష్టాలు

నంద్యాల హాస్పిటల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా బ్రిడ్జి ఉండటంతో ఇరుకువంతెనతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో బ్రిడ్జి అంచనా వ్యయం రెండింతలైంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ బ్రిడ్జి వైసీపీ ప్రభుత్వంతో పట్టించుకోకపోవడంతో చివరకు అసంపూర్తిగా దర్శనమిస్తోంది. గతంలో వరదముంపునకు గురై బ్రిడ్జిపై నీరు పారుతూ రాకపోకలకు ఆటంకం కలుగుతున్న దృష్ట్యా టీడీపీ ప్రభుత్వంలో వరద ముంపునకు గురికాకుండా ఎత్తయిన బ్రిడ్జిని ఏర్పాటు చేసేందుకు 2016లో రూ.7.33కోట్లతో పనులు ప్రారంభించారు. 2017లో ఓ కంపెనీకి పనులు అప్పగించారు. ఈ కాంట్రాక్టర్ 2019వరకు దాదాపు రూ.1.40 కోట్ల పనులు చేసి అనివార్య కారణాల వల్ల వదిలేశారు. దీంతో అధికారులు 2020లో కొత్త అలైన్‌మెంట్ మార్చారు. గతంలో దాదాపు 3 ఎకరాలు రైతులవద్ద నుంచి కొనుగోలు చేసి ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసేందుకు ప్రతిపాదనలు పంపారు. ఇందుకుగానూ రైతులకు దాదాపు రూ.18కోట్లు చెల్లించేలా అప్పటి ఆర్డీవో అంచనాను తయారు చేశారు. బడ్జెట్ ఎక్కువగా ఉండటంతో భూ సేకరణను కుదించి కేవలం 75 సెంట్లను మాత్రమే తీసుకొని రైతులకు రూ.3.24కోట్లు చెల్లించేందుకు ప్రతిపాదనలు పంపారు. క్లాజ్ 60సి కింద వర్క్ బ్యాలెన్స్‌ను 2021లో ఓ సంస్థకు అప్పజెప్పారు. ఈ కాంట్రాక్టర్ 2023 వరకు దాదాపు రూ.9 కోట్ల పనులు చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం కేవలం కోటి రూపాయలు ఇచ్చి చేతులెత్తేసింది. కొత్తగా రివైజ్ చేసిన ప్రతిపాదన రూ.23.45కోట్లకు ప్రభుత్వం మంజూరు చేసింది. దాదాపు 9 ఏళ్ల నుంచి పనులు పూర్తిచేయకపోవడంతో బ్రిడ్జి నిర్మాణ పనులకు రెట్టింపు వ్యయం కావడం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. భూ సేకరణలో దాదాపు 20మంది రైతులకు ప్రభుత్వం నుంచి డబ్బు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం రైతులు నష్ట పరిహారం రూ.4.5కోట్లు అడుగుతుండటంతో పనులు ముందుకు సాగడంలేదనేది స్పష్టం అవుతోంది. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణానికి దాదాపు రూ.14 కోట్లు మంజూరు చేశారు. కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లిస్తే పనులు పూర్తి చేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో చేతులెత్తేశారు. జిల్లా మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి చొరవచూపితే బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. టీడీపీ హయాంలో ప్రారంభించిన ఈ బ్రిడ్జి తిరిగి టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తవుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏళ్లనాటి కల సాకారం అయ్యే దిశగా ప్రభుత్వం చొరవచూపి ప్రజలను ఇక్కట్లనుంచి విముక్తి చేయాలని కోరుతున్నారు. నిధులు మంజూరైతే నాలుగు నెలల్లోనే పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పగిడ్యాల రోడ్డుకు ప్రాధాన్యం ఇవ్వాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు నిలయంగా మారిన పగిడ్యాల రోడ్డును కొత్తగా వేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అసెంబ్లీలో సభాధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాలు 5వ రోజు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో ఐదేళ్లలో రూ.7.345 కోట్లు మాత్రమే రహదారులకు ఖర్చు పెట్టారన్నారు. అయితే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కొత్త రహదారులు నిర్మించడానికి బడ్జెట్‌లో రూ.823 కోట్లు కేటాయించిందన్నారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని నందికొట్కూరు నుంచి పగిడ్యాల మండల కేంద్రానికి 10 కిలో మీటర్లు మేర అధ్వానంగా తయారైందన్నారు. ఈ రోడ్డులో అధికారులు, ప్రయాణికులు వేళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మొదటి ప్రాధాన్యతగా నందికొట్కూరు నుంచి పగిడ్యాలకు డబల్ రోడ్డు నిర్మాంచాలని కోరారు. అలాగే నందికొట్కూరు నుంచి అల్లూరు గ్రామం మీదుగా బ్రాహ్మణకొట్కూరు వరకు 12 కి.మీటర్ల మేర రహదారి కూడా గుంతలమయమైందన్నారు. ఈ రెండు రోడ్లను మొదటి ప్రాధాన్యతగా నిర్మించేందుకు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు.

ఆర్జీఎంలో సాంకేతిక సదస్సు ప్రారంభం

పాణ్యం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్రైజెన్ జాతీయ సాంకేతిక సదస్సు ప్రారంభించారు. ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. సదస్సులో విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించేలా వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాల సేకరణ కేంద్రాల తనిఖీ


నూనెపల్లెలో పాల శాంపిల్‌ను సేకరిస్తున్న అధికారులు

నంద్యాల కల్చరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని పలు పాల సేకరణ కేంద్రాలలో పాలను తనిఖీ చేసినట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, కాశింవలి తెలిపారు. అధికారి వెంకటరాముడు మాట్లాడుతూ పాల శాంపిళ్లను సేకరించి స్టేట్ ఫుడ్ ల్యాబొరెటరీకి పంపినట్లు తెలిపారు. బుధవారం పట్టణంలోని నూనెపల్లెలోని దినేష్ పాలసేకరణ కేంద్రం, శ్రీనివాససెంటర్ నరసింహ మిల్క్ సెంటర్, నంది డెయిరీని తనిఖీ చేసి పాల శాంపిళ్లను సేకరించారు. ప్రజలకు నాణ్యమైన పాలను సరఫరా చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటరాముడు పాల శీతల సేకరణ కేంద్రాల యజమానులను ఆదేశించారు. ఏదైనా కల్తీ నిరూపణ జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'కేసీ ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలి'


ధర్నా చేస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేసీ ఆయకట్టుకు తక్షణమే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి డిమాండ్ చేసింది. బుధవారం సాధన సమితి సభ్యులు కెసి కెనాల్ కార్యాలయం దగ్గర ధర్నా చేశారు. సమితి ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి మాట్లాడారు. కేసీ ఆయకట్టు పరిధిలో 70 ఎకరాల రబీ పంట సాగవుతోందని, ఏప్రిల్ 30 వరకు నీరందిస్తే తప్ప అన్నదాత మనుగడ సాగించే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం కేవలం 120 రోజుల వ్యవధిలో 1562 టీఎంసీల నీరు శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరినప్పటికీ నీటి సరఫరా ఎందుకు ఆపారని ప్రశ్నించారు. తక్షణమే కేసీకి నీటిని పునరుద్ధరించి ఆయకట్టు రైతాంగానికి ఆదుకోవాలని కోరారు. ధర్నా అనంతరం కేసీ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బెక్కెం చిన్న రామకృష్ణా రెడ్డి, డీవీ సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

'పశువులకు టీకా వేయించాలి'

మహానంది, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని పశు వైద్యుడు డాక్టర్ శివానంద్ తెలిపారు. గోపవరం, గాజులపల్లి గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం బుధవారం పశువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని మార్చి 1 నుంచి 30 వరకు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పశు పోషకులు పశువులకు వ్యాధి నివారణకు టీకాలు వేయించి వ్యాధులు సోకకుండా కాపాడుకోవాలన్నారు. నాలుగు నెలల దూడ నుంచి పెయ్యదూడ, దున్నపిల్ల అనే తేడా లేకుండా పాడి గేదెలు,ఆవులు అన్నింటికీ గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని పాడి రైతులకు సూచించారు.

'ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి'

కొత్తపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్వో ప్లాంటు నిర్వాహకులు ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని నీటి కలుషితం కాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ సూచించారు. బుధవారం మండలంలోని దుద్యాలలో ఉన్న వాటర్ ప్లాంటును ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహ్మద్ జుబేర్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఈవోఆర్‌డీ పార్థసారథి, పలువురు అధికారులు ఆర్వో ప్లాంటు నిర్వహకులు ఉన్నారు.

- ఎన్‌హెచ్-167కే రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు వారి భూములకు చెందిన సరైన ధ్రువీకరణ పత్రాలు అధికారులకు ఇవ్వాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. బుధవారం పెద్దగుమ్మడాపురం గ్రామంలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 16 మంది రైతులు 9 ఎకరాల భూమిని రహదారి నిర్మాణంలో కోల్పోతున్నారన్నారు. వారు అధికారులకు వారికి చెందిన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని, వాటిని అందిస్తే నష్టపరిహారం అందేలా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో డీటీ పెద్దన్న, సర్పంచ్ నక్కావిజయ్ కుమార్, వీఆర్వోలు మౌలాలి, శ్రీను, రైతులు ఉన్నారు.

పట్టణంలో కనీస సౌకర్యాల కల్పనపై చర్చ

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మున్సిపల్ పరిపాలన శాఖ పట్టణ అభివృద్ధి ప్రణాళిక విభాగం అధికారుల ఆధ్వర్యంలో వెబినార్ నిర్వహించారు. ప్రధానంగా తాగునీటి కొరతను అధిగమించటంతో పాటు ప్రజల తాగునీటి అవసరాలు ఎలా తీర్చాలి, పారిశుధ్య నిర్వహణ ప్రణాళిక బద్ధంగా ఎలా నిర్వహించాలలన్న అంశాలపై చర్చ జరిగింది. పట్టణ మౌలిక సదుపాయాల కల్పనపై బుధవారం నంద్యాల మున్సిపల్ కమాండ్ కంట్రోల్ హాల్ నుంచి మున్సిపల్ సహాయ కమిషనర్ వెంకటదాసు, పారిశుధ్యశాఖ అధికారి మురళి, ఇంజనీర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు 170 గృహాలు మంజూరు

కొత్తపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు గిరిజన గూడేలకు మహర్దశ సంతరించుకుందని, ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద 170 గృహాలు మంజూరైనట్లు మండల హౌసింగ్ ఏఈ పాండురంగనాయక్ తెలిపారు. బుధవారం ఆయన కొత్తపల్లిలో మాట్లాడుతూ మండలంలోని గువ్వలకుంట్ల గూడేనికి 25 గృహాలు, ముసలిమడుగుకు 7, ఎదురుపాడుకు పది, కొత్తపల్లికి 14, శివపురంకు 43, ఎర్రమఠం గూడెంకు 37, గుమ్మడాపురం గిరిజనగూడెంకు 22 గృహాలు మంజూరైనట్లు చెప్పారు. ఒక్కో గృహానికి రూ.3.39 లక్షలు మంజూరు కాగా, లబ్ధిదారుడు గృహ నిర్మాణం బట్టి వారి బ్యాంకు ఖాతాకు నగదు జమ అవుతుందని చెప్పారు. ఇప్పటికే గువ్వలకుంట్ల గూడెంకు 25 గృహాలు మంజూరు కాగా, ఇటీవలే 25 గృహాల నిర్మాణాలు మొదలు పెట్టారని చెప్పారు. అలాగే ముసలిమడుగులో 9 గృహాలు మంజూరు కాగా, 7 గ్రౌండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎదురుపాడు గూడెంకు 10 మంజూరు కాగా.. 5 గృహాల నిర్మాణాలు పనులు మొదలు పెట్టినట్లు ఏఈ వెల్లడించారు. గృహాలు మంజూరు కావడం పట్ల గిరిజన గూడెంలోని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీబీ ముక్త్ పంచాయతీలుగా భూపనపాడు, ఎస్.కొత్తూరు


భూపనపాడు గ్రామాన్ని సందర్శిస్తున్న అధికారులు

పాణ్యం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపనపాడు, ఎస్.కొత్తూరు గ్రామాలు గ్రామ పంచాయతీ టీబీ ముక్త్ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. దీంతో ఈ గ్రామాలను బుధవారం జిల్లా పరిశీలన బృందం అధికారి, జిల్లా పంచాయతీ అధికారి షేక్ జమీఉల్లా, ఎంటీటీసీ డాక్టర్ వినయ్, డిపిఎం నాగార్జునరెడ్డి, ఎస్టీఎస్ శివుడు, ఎస్‌టీఎల్‌ఎస్ రేణుకా దేవి సందర్శించారు. గ్రామంలోని రికార్డులు పరిశీలించారు. గ్రామ ప్రజలతో చర్చించారు. టీబీ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్, భూపనపాడు సర్పంచ్ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈవో సుబ్బారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వో, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

'భూసార పరీక్షలు తప్పనిసరి'

పాములపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు తప్పనిసరిగా తమ పొలంలో భూసార పరీక్షలు చేయించి అందుకు తగినట్లుగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని బానుముక్కల, బానకచెర్ల గ్రామాలలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి హేమలత మాట్లాడుతూ రైతులు పంటమార్పిడి చేయాలని, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. మినుములో పల్లాకు తెగులు తట్టుకొనే పీవీ-31, జీబీజీ-47, టీబీజీ-104 రకాలను సాగుచేయాలని సూచించారు. పురుగుల నివారణకు అంతర్ పంటగా జొన్న నాలుగు వరుసల కంచె వలె నాటాలన్నారు. కాండపు ఈగ నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలను ఎకరానికి 10 కేజీల చొప్పున దుక్కిలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి'

మహానంది, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీలో పంట నమోదు చేయించుకొన్న రైతులు మార్చి 6 వతేది లోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు వరి పంటకు అవసరమైన మేరకే యూరియా ఎరువులు వాడాలని, మోతాదుకు మించి అధికంగా ఉపయోగించితే పంటను పురుగులు, తెగుళ్ల అధిక స్థాయిలో ఆశించే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, వీఏఏ లక్ష్మీకాంత్, రైతులు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం

- తీగలను మిర్చి లోడుతో వెళ్తున్న లారీ లాక్కెళ్లిన వైనం


తీగలను లాకెళ్తున్న లారీ

మిడుతూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామంలోని చింతలపల్లి రహదారిలో ఖాజీపేట గ్రామం నుంచి అధిక లోడుతో మిర్చి లారీ విద్యుత్ తీగలకు తగులుకొని వెళ్లడంతో విద్యుత్ స్తంభం విరిగి ఓ ఇంటి మీద పడింది. స్తంభం విరిగిన ప్రదేశంలో ఎవరూ లేకపోవ డంతో ప్రమాదం తృటిలో తప్పినట్లు ఇంటి యజ మాని మధుసూదన బాబు తెలి పారు. విద్యుత్ స్తంభం విరిగిన కారణంగా తమ కాలనీకి 10 గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడి ఇబ్బందులు పడినట్లు ఆయన తెలిపారు. తన ఇంటి ముందు గోడ కూలి నష్టం వాటిల్లినట్లు ఆయన చెప్పారు. లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మధుసూదనబాబు తెలిపారు.

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

నంద్యాల హాస్పిటల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల గురురాజ పాఠశాల క్రీడా మైదానంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను గురురాజ విద్యాసంస్థల డైరక్టర్ షేక్షావలి రెడ్డి ప్రారంభించారు. ఈపోటీలలో వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగినులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి జిల్లా సంఘం కార్యాలయంలో మార్చి 8వ తేదీన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటుగా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిరుపాలయ్య, సహాధ్యక్షుడు శ్రీహరి, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఫకృద్దీన్, విజయలక్ష్మి, సత్యం, ప్రభావతమ్మ , ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన అతిసార కేసులు

- ఒకటి మినహా అన్ని మినరల్ వాటర్ ప్లాంట్లలో శుద్ధ జలాలే
- అనంతపురం మున్సిపల్ ఆర్‌డీ విశ్వనాథ్ వెల్లడి


మాట్లాడుతున్న ఆర్డీ విశ్వనాథ్

ఆత్మకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్లవీధిలో అతిసార తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. బుధవారం కాలనీకి చెందిన ఇద్దరికి మాత్రమే విరేచనాలు ఉన్నట్లు అక్కడి వైద్యులను సంప్రదించగా వారు సాధారణ స్థితిలోనే ఉండటంతో వారికి వైద్యచికిత్సలు అందించారు. అదేక్రమంలో కాలనీలో ముమ్మరంగా పారిశుధ్య చర్యలతో పాటు ఎప్పటికప్పుడు వైద్యబృందాలచే సర్వే చేపట్టి ఎవరికైనా అనారోగ్య పరిస్థితులు ఉన్నాయా..? అని తీశారు. అలాగే కాలనీకి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారానే శుద్ధ జలాలను అందజేస్తున్నారు. ఇదిలావుంటే బుధవారం అనంతరం మున్సిపల్ ఆర్‌డీ విశ్వనాథ్ నీలితొట్లవీధిని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ప్రస్తుత పరిస్థితి గురించి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. నీలితొట్లవీధి, పరిసర కాలనీల్లో అతిసార తగ్గుముఖం పట్టిందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రత్యేకించి పట్టణానికి సరఫరా జరిగే మున్సిపల్ వాటర్‌తో పాటు అన్ని ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నీటినమూనాలను కర్నూలు రీజనల్ ల్యాబ్‌కు పంపించి పరీక్షగా ఒక్క వాటర్ ప్లాంట్‌లో మాత్రమే బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆ ప్లాంట్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు. మిగతా వాటర్ ప్లాంట్ల రిపోర్టులన్ని పాజిటివ్‌గా వచ్చాయని తెలిపారు. కాగా ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఏవైనా అనారోగ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. ఇదిలావుంటే కొంతమంది సాధారణంగా విరేచనాలకు గురైన అతిసార అని ఆందోళన చెందుతున్నారని, ఎవరు భయపడాల్సిన అవసరం లేదని గుర్తుచేశారు. ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల అత్యుత్సాహం :

ఆత్మకూరులోని ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. పట్టణంలోని నీలితొట్లవీధిలో గల ఓ వాటర్ ప్లాంట్ నీటినమూనాల్లో ఈ-కోలీ బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారణ కావడంతో అధికారులు ఆ ప్లాంట్‌ను సీజ్ చేశాయి. అయితే మంగళవారం సాయంత్రం పట్టణంలోని అన్ని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు సమావేశం ఏర్పాటు చేసుకుని తమ ప్లాంట్ల నీటినమూనాల రిపోర్టులు వచ్చే వరకు తమ ప్లాంట్లను మూసివేయనున్నట్లు ప్రకటించారు. దీంతో మంగళవారం రాత్రి వరకు నీటికోసం ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. అదేక్రమంలో బుధవారం కూడా వాటర్ ప్లాంట్లు మూసివేయడంతో జనం నీటి కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా బ్లాక్‌మెయిల్ ధోరణిలో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు వ్యవహరించిన తీరుపై అధికారులతో పాటు ప్రజలు సైతం మండిపడ్డారు. కేవలం తమ వాటర్ ప్లాంట్ల జోలికి రాకూడదన్న ఉద్దేశంతోనే వారు ఈ బెదిరింపులకు పాల్పడినట్లు విమర్శలు ఉన్నాయి.

ట్రైనీ ఎస్‌ఐలకు సన్మానం


ట్రైనీ ఎస్‌ఐలను సన్మానిస్తున్న ఎస్‌ఐ, ఉపాధ్యాయులు

వెలుగోడు మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలో ఇరువురు ఎస్‌ఐలుగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకొని ట్రైనీ ఎస్‌ఐలుగా ఒకరు సత్యసాయి జిల్లాకు, మరొకరు కడప జిల్లాకు ట్రైనీ ఎస్‌ఐలుగా నియమితులయ్యారు. మాధవరం గ్రామానికి చెందిన సతీష్, గుంతకందాల గ్రామానికి చెందిన కీర్తన ట్రైనీ ఎస్‌ఐలుగా నియమితులయ్యారు. వీరిద్దరు వెలుగోడులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థులే. దీంతో బుధవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ఎస్‌ఐ విష్ణు నారయణ యువ ఎస్‌ఐలను ఘనంగా సన్మానించి వారి తల్లిదండ్రులను అభినందించారు.

సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో బుధవారం లోకకల్యాణార్థం సాక్షిగణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

నంద్యాల కల్చరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నంద్యాల జగజ్జననీ దేవాలయ వార్షికోత్సవాన్ని గురువారం నుంచి 10 వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు తెలిపారు. 6న అమ్మవారికి అభిషేకం, మంగళ హారతి, 7న సహస్ర కలశ క్షీరాభిషేకం, 8న సహస్ర నామ, కుంకుమార్చన, 9న నవావరణ పూజావిధితో శ్రీ చక్రార్చన, 10న చండీహవనము-బలిప్రదానం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి స్త్రీలు సంప్రదాయ దుస్తులలో రావాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

నంద్యాల కల్చరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని భగవాన్ శ్రీకృష్ణ అఖిల భారత నిత్యాన్నదాన సేవాసంస్థ నూతన కార్యవర్గాన్ని నంద్యాల పద్మావతీనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా గొర్ల సత్యనారాయణ యాదవ్, ఉపాధ్యక్షులుగా మల్లేష్ యాదవ్, వెంకటరాముడుయాదవ్, ప్రకాష్‌యాదవ్, బాలగురువర్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌యాదవ్, కోశాధికారిగా మనీష్ యాదవ్, కార్యదర్శులుగా బాపయ్యయాదవ్, వెంకటేశ్వర్లు యాదవ్, వేణుగోపాల్ యాదవ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకృష సేవా సమితి నిర్వాహకులు పార్థసారధి కృష్ణ, విజయచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

'వేతనాలు పెంచాలి'

ఆత్మకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవోనెం 36 ప్రకారం జీతాలు పెంచాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు పెద్దనాగరాజు, తిమ్మయ్య కోరారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యుత్, నీటి సరఫరా చేస్తున్న కార్మికులు స్కిల్డ్, సెమీస్కిల్ వేతనాలు ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని చెప్పారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ చెల్లించాలని అన్నారు. ఆయా సమస్యలపై మార్చి 7వ తేదిన చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఖాజాఖాన్, బాలరాజు, చిన్ననాగరాజు, ప్రసాద్, సంజన్న తదితరులు ఉన్నారు.

'జయప్రదం చేయండి'

ఆత్మకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఈ నెల 8 నుంచి 17 వరకు జరిగే జనచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ తెలిపారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 8వ తేది నుంచి మహిళా సమస్యలపై యాత్రలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 22 నుంచి 28 వరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలన్నారు. నాయకులు సురేంద్ర, వీరన్న, షేక్ ఇస్మాయిల్, భాస్కర్ ఉన్నారు.

'దళారుల దోపిడీని అరికట్టాలి'


నంద్యాలలో ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

నంద్యాల రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పంటల కొనుగోళ్లలో దళారుల దోపిడిని అరికట్టాలని వివిధ సంఘాలు పిలుపునిచ్చాయి. బుధవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో చేపట్టారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి. రమేష్ కుమార్, ఎ. రాజశేఖర్, రాయలసీమ సాగునీటి సంఘం సాధన సమితి నాయకులు వైఎన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు ఆనంద్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మార్క్ సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెన్న బాల వెంకట్‌లు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం ఇచ్చారు.

యాగంటి సన్నిధిలో జేసీ విష్ణుచరణ్



ఉమా మహేశ్వర స్వామిని దర్శించుకున్న జేసీ దంపతులు

బనగానపల్లె, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా జేసీ విష్ణుచరణ్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది జేసీ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉమామహేశ్వరస్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు నారాయణరెడ్డి, రెవెన్యూ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా సీహెచ్‌వో జఫరుల్లా

బేతంచెర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా సీహెచ్‌వో జఫరుల్లా అన్నారు. బుధవారం పట్టణంలోని సామాజిక కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో బాలింతలు, రోగుల వార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులకు, సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు డేటాలను కంప్యూటర్లలో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ప్రభుత్వ వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడు సెంట్ల స్థలం ఇవ్వాలి



అంబాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబాపురం గ్రామంలో ఇల్లు లేని పేదలకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య ఆధ్వర్యంలో అంబాపురం గ్రామంలోని గంగమ్మ గుడి నుంచి గ్రామ వీధుల్లో బాధితులతో కలిసి ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాగంటికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమిని అర్హులైన లబ్ధి దారులకు మూడు సెంట్ల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్‌యన్నా, సహాయ కార్యదర్శి తిరుమలేష్, ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శివయ్య, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, నాయకులు పాల్గొన్నారు.

కేసీకి 2,250 క్యూసెక్కుల నీరు విడుదల

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 5(ఆంధ్రజ్యోతి) : కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పరిష్కరించారు. కేసీ కెనాల్‌కు సాగునీరు నిలుపుదల చేయడంతో పంటలు ఎండిపోతున్నాయని నియోజకవర్గంలోని రైతులు సమస్యను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తక్షణం స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. సుంకేసుల నుంచి 1,700 క్యూసెక్కుల నీటిని, మల్యాల నుంచి 650 క్యూసెక్కులు కలిపి మొత్తం 2,250 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు బుధవారం విడుదల చేయించారు. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వీడండి



బోడెమ్మనూరులో మినీ గోకులాన్ని పరిశీలిస్తున్న ఉపాధి పీడీ

ఉయ్యాలవాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులపై సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని పీడీ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. బుధవారం బోడెమ్మనూరు గ్రామంలో మినీ గోకులాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మండలంలోని మినీ గోకుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేయించాలన్నారు. మండలానికి చేటాయించిన 480 ఇంకుడు గుంతలను త్వరగతిన పూర్తి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో రవిప్రకాష్, ఈసీ షరీఫ్ బాష, టీఏ నరసింహరావు ఉన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంఈవో, హెచ్‌ఎం

ఉయ్యాలవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను నివారించేందుకు మహిళలు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. ఈసీసీఈ డే సందర్భంగా స్థానిక రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలతో సమావేశమయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగి అనర్థాలను వివరించారు. సమావేశంలో ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి జయ రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆదాము, గ్రామ మహిళా సంరక్షణాధికారి సరస్వతి, కార్యకర్తలు రాజేశ్వరి, ఫక్రుబీ, ఆయాలు ఉన్నారు.

గిట్టుబాటు ధర హామీని అమలు చేయాలి

రుద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రైతులకు గిటుబాటు ధరల హామీని అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి భాస్కర్ అన్నారు. బుధవారం రుద్రవరంలో రైతులకు ధరల హామీ చట్టం అమలు పత్రాలను పంచారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం సరికాదన్నారు.

VEHICLE FOR SALE

VEHICLE NO.	DESCRIPTION	MODEL
AP39UV0411	AL E COMET 1915 BS6	2024

వేలము వేయు ప్రదేశం :
శ్రీరామ్ ఆటోమాల్, పంచలింగాల,
NH-7, అలంపూర్ టోల్‌గేట్ దగ్గర, కర్నూలు.
వేలము వేయు తేది : 06-03-2025 (గురువారం)
99693 95135, 80080 77708.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

- పట్టించుకోని అధికారులు
- సమస్యల్లో సర్కారు పాఠశాలలు



గొడిగనూరులో నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు



చిన్నవంగలిలో పిల్లర్లకే పరిమితమైన పాఠశాల భవన పనులు

చాగలమర్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 20 పాఠశాలలకు రెండో విడత నాడు-నేడు కింద దాదాపు రూ.9.49 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కమిటీలు కలిసి పనులు ప్రారంభించారు. ప్రారంభించిన పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. పిల్లర్ల వరకు పనులు చేసి వదిలేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో భవన నిర్మాణ పనులు ముందుకు సాగక నిలిచిపోయాయి. దీంతో పాఠశాలలో విద్యార్థులు భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా పనులు చేయకుండా నిలిపి వేశారు. ముత్యాలపాడులో మూడు అదనపు గదులకు రూ.11.61 లక్షలు, గొడిగనూరులో మూడు భవనాలకు రూ.14.74 లక్షలు, మద్దూరులో మూడు భవనాలకు రూ.53 లక్షలు, బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగు భవనాలకు రూ.36.45 లక్షలు, బాలికోన్నత పాఠశాలకు నాలుగు భవనాలకు రూ.49.88 లక్షలు, చిన్నవంగలి ఉన్నత పాఠశాలలో నాలుగు భవనాలకు రూ.30.20 లక్షలు, కస్తూర్బా పాఠశాలకు రూ.3.49 లక్షలు ఖర్చు చేశారు. నిధులు లేక పోవడంతో పాఠశాలలో పనులు అర్ధాంతరంగా నిలిపి వేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేయకుండా నిలిపి వేశామని హెచ్‌ఎంలు, కమిటీలు చెబుతున్నారు. మంజూరైన నిధుల వరకు పనులు చేశామని అన్నారు. ఇకమీదట డబ్బులు మంజూరైతేనే పనులు చేస్తామంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు-నేడును తొలగించి మనబడి-మనభవిష్యత్తుగా మార్చింది. ఈ పథకంతోనైన అసంపూర్తిగా ఉన్న భవన పనులను పూర్తి చేసి పాఠశాలల్లో విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు కోరుతున్నారు. ఎంఈవో అనూరాధను వివరణ కోరగా గత ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాకపోవడం వల్లే పనులు నిలిచి పోయాయని తెలిపారు. మంజూరైన 15 శాతం బిల్లుల వరకు పనులు చేసి వదిలేశారని చెప్పారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు పాఠశాల భవనాల పనులు గురించి ప్రతిపాదనలు చేయాలని ఆదేశించడంతో అసంపూర్తిగా ఉన్న భవన పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామని అన్నారు.



మద్దూరులో అసంపూర్తిగా పాఠశాల భవన పనులు

ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకోండి

- జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

కోవెలకుంట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తొలకరి వర్షాలు కురిసిన వెంటనే మినుము, పెసర, రబీలో శనగపంట సాగు చేసుకోవాలని అధిక లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. బుధవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని సౌదరదిన్నె గ్రామంలో ఏవో నిరంజన్ ఆధ్వర్యంలో చేపట్టిన పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మ డిజిటల్ నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టరు చెన్నయ్య, ఏడీఏ సుధాకర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

కొలిమిగుండ్ల : రైతులు మారుతున్న పరిస్థితులకు అణుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి భూమా జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని ఉమ్మాయిపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు, వీఏఏలు సందీప్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు నిర్వహిస్తాం

- డోన్ డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి



అవుకులో తరగతి గదిని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి

అవుకు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డోన్ డిప్యూటీ డీఈవో ఎస్.వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం ఎంఈవోలు శ్రీధర్ రావు, వెంకటేశ్వరెడ్డితో కలిసి పట్టణంలో పదవతరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఎంపిక చేసిన మూడు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ అవుకు మండలంలో 11 జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఏపీ మోడల్‌స్కూల్, కస్తూర్బా, 2 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా 610 మంది విద్యార్థులు పదవతరగతి పరీక్షలకు హాజరు కావాల్సి ఉందన్నారు. అవుకు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులు, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులు, సెంట్‌మేరీస్ పాఠశాల పరీక్ష కేంద్రంలో 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పాఠశాలల గదుల్లోని సౌకర్యాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో బాలురు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శింగయ్య, చెన్నకేశ్వరి పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధే లక్ష్యం



ఎం.తండాలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీడీ రమణయ్య

చాగలమర్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడిపరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య తెలిపారు. బుధవారం మండలంలోని ఎం.తండా గ్రామంలో జరుగుతున్న గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశువుల వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బ్రూసెల్లేస్ వ్యాధి నివారణకు దూడలకు టీకాలు వేస్తున్నామని, గేదులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నారని అన్నారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని 12 మండలాల్లో సుమారు లక్ష దాక పశువులు ఉన్నాయని అన్నారు. చాగలమర్రి మండలంలో 10 వేలు పశువులు ఉన్నాయని, ఇప్పటి వరకు 2 వేల పశువులకు టీకాలు వేశామన్నారు. రైతులు గేదెలకు టీకాలు తప్పనిసరిగా వేయించేందుకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సాయిబాబా, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

15 వరకు గంగకు నీరు



22వ గంగబ్లాక్ చానెల్ తూము వద్ద సిబ్బందిని వివరాలు అడుగుతున్న సూపరింటెండెంట్ ఇంజనీరు శివప్రసాద్‌రెడ్డి

రుద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి వారబందీ పద్ధతిలో ఈ నెల 15 వరకు నీటిని విడుదల చేస్తామని తెలుగుగంగ సూపరింటెండెంట్ ఇంజనీరు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలుగుగంగ కాల్వ వెంట నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి రెండు వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశామన్నారు. రుద్రవరం సమీపంలో 58వ కిలోమీటరు వద్ద 776 క్యూసెక్కులనీరు సరఫరా అవుతుందని అన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు పూర్తి సామర్థ్యం 16.95 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.3 టీఎంసీల నీరు ఉందన్నారు. వాటిలో 3.5 టీఎంసీల నీరు సాగునీటి కోసం నిల్వ ఉంచాల్సి ఉందన్నారు. తదుపరి నీటి విడుదల నీటి సామర్థ్యాన్ని బట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుకంటామన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు

మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు



బ్రాహ్మణపల్లె చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

చాగలమర్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లె, ముత్యాలపాడు, పెద్దబోధనం, పెద్దవంగలి, చాగలమర్రి తదితర గ్రామాల్లోని చర్చిల్లో భస్మ బుధవారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు పొందిన సిలువ శ్రమలను తలంచుకుంటూ 40 రోజుల పాటు ఉపవాస దినాలను చేపడతారు. గుడ్‌ఫ్రైడే వరకు ఉపవాసదినాలు పాటిస్తారు. ఉపవాస దినాల విశిష్టతను ఫాదర్లు వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

● **ఉయ్యాలవాడ:** మండలంలోని ఆయా గ్రామాల్లో భస్మ బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉయ్యాలవాడ పాస్టర్ జోషిబాబు ఆధ్వర్యంలో మండలంలోని ఉయ్యాలవాడ, రూపనగుడి, ఆర్.పాంపల్లె, సుద్దమల్ల, కొండుపల్లె, మాయలూరు, అల్లూరు తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈబూది రాశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

11న గ్రామ పంచాయతీలో వేలం

కోవెలకుంట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీలో ఈ నెల 11న సంత మార్కెట్, దిన మార్కెట్, బస్టాండు, కబేళా వేలం నిర్వహించనున్నట్లు ఈవోఆర్‌డి ప్రకాశ్ నాయుడు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు దరావత్తు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగ అవకాశాలు

శిరివెళ్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకుంటే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. కళాశాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అకౌంట్స్ అండ్ ఎగ్జిక్యూటివ్ కోర్సును నూతనంగా ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ బుధవారం వెల్లడించారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యాపకులు జనార్దనుడు, స్కిల్‌హబ్ కన్వీనర్ మాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయండి

కోవెలకుంట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు మేనేజర్లకు లీడ్ జిల్లా మేనేజరు రవీందర్ సూచించారు. బుధవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన బ్యాంకు మేనేజర్లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ గురుస్వామి, ఏబీఎం శేఖర్, ఐదు మండలాల ఎంపీడీవోలు, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన మొక్కల సంరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలని ప్లాంటేషన్ మేనేజర్ రషీద్ అన్నారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్‌ఏల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, ఈసీ నరసింహ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

ప్యాపిలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని అరుణాచల ట్రాన్స్‌పోర్టులోని అభయాంజినేయస్వామి గుడి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి దేవర

డోన్ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామంలో బుధవారం పెద్దమ్మతల్లి దేవర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో గ్రామంలో ప్రతి ఇంటి వద్ద బంధువులతో కళకళలాడాయి. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మురళీకృష్ణగౌడు బ్రదర్స్ ఆహ్వానం మేరకు రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి పెద్దమ్మతల్లి దేవర మహోత్సవాల్లో పాల్గొన్నారు. అలాగే సినీ నిర్మాత మహేష్‌ఖన్నా, టీడీపీ నాయకులు చిన్న నాగిరెడ్డి, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, వై.హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీమాత ప్రతిష్ఠ దినోత్సవం

చాగలమర్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరిదేవి 90వ ప్రతిష్ఠ దినోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కోశాధికారి ప్రసాదు తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో వాసవీమాత వ్రతం, పూర్ణాహుతి, గణపతి హోమం, రుద్రాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. వీరాంజనేయస్వామి ప్రతిష్ఠ దినోత్సవం కూడా జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

డోన్ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం చిన్నమల్కాపురం గ్రామంలో కాటికాపరులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ నెల 11న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వసతి గృహంలో అభివృద్ధి పనులు

ప్యాపిలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో రూ.5లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వార్డెన్ గౌడురాజు తెలిపారు. ఫ్లోరింగ్, మరుగుదొడ్లకు నీటి వసతి ఏర్పాటు చేస్తామన్నారు. ఇతరపనులు నిధులు మంజూరు అయిన వెంటనే చేపడుతామన్నారు.

వధువుకు పెళ్లి కానుక పంపిణీ



పెళ్లికానుకను అందజేస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో పేదలకు బుధవారం పెళ్లి కానుకను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పంపిణీ చేశారు. సొంత నిధులతో వధువుకు పెళ్లి కానుకను అందించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణ బాధ్యత తల్లిదే

బనగానపల్లె, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : చిన్నారుల సంరక్షణ బాధ్యత తల్లిదేనని ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం పట్టణంలోని అంగన్‌వాడీ ఆరవకేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సృజనాత్మక వేడుకలు నిర్వహించారు. ఆటలు, పాటలు, కబుర్లు కథల ద్వారా చిన్నారులు నేర్చుకున్న వాటిని అడిగి తెలుసుకున్నారు. గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు చిట్టెమ్మ, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో రాజబాబు అన్నారు. బుధవారం ఉపాధి పనులు పరిశీలించిన ఆయన ప్రస్తుతం మండలంలో ప్రతి రోజూ 1200మంది వరకు కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉపాధి సిబ్బంది పనులు గుర్తించారన్నారు. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉపాధి పనులకు వెళ్లాని ఏపీవో సూచించారు.

ఏడు నుంచి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

కోవెలకుంట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సభాపతి రోడ్డులో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథస్వామి ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 7 నుంచి 9వతేదీ వరకు నిర్వహించనున్నట్లు కాశీ విశ్వనాథస్వామి భక్తజన బృందం తెలిపారు. ఇందులో భాగంగా 7న శుక్రవారం ఉదయం 7.30గంటలకు గంగాయానం, గోపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన, యాగశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8న ప్రత్యేక పూజలు, 9న తెల్లవారుజామున విగ్రహ ప్రతిష్ఠ హోమం, ప్రాణ ప్రతిష్ఠ హోమం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ఎఫ్‌ఏ-4 పరీక్షల పరిశీలన

చాగలమర్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి, కస్తూర్బా, బాలికోన్నత పాఠశాలలో జరుగతున్న ఎఫ్‌ఏ-4 పరీక్షలను ఎంఈవో న్యామతుల్ల పరిశీలించారు. రంజాన్ సందర్భంగా ఉర్దూ పాఠశాలల సమయాన్ని మార్పు చేశామని, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాఠశాలలు నిర్వహించాలని సూచించారు. ఆర్సీఎం, ఎయిడెడ్ పాఠశాలలను ఎంఈవో అనూరాధ తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జీవితం విలువైనది



విద్యార్థులతో మాట్లాడుతున్న కోఆర్డినేటరు చాయేంద్రకుమార్

రుద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జీవితం విలువైనదని పీఎంయూ సమగ్ర శిక్ష రాష్ట్ర కోఆర్డినేటర్ చాయేంద్రకుమార్ అన్నారు. బుధవారం రుద్రవరం ఆదర్శపాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యాభ్యాసం ఎలా ఉంది? ఎలా చదువుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిడికి గురి కాకుండా బాగా చదువుకోవాలని సూచించారు. సమావేశంలో జీసీడీవో నాగసువర్చల, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.